
ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# విజయవాడలో 'వార్ 2'

## ఈవెంట్.. స్పందించిన నిర్మాణ సంస్థ



ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'వార్ 2'. భారీ అంచనాల మధ్య ఆగస్టు 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో అందరి దృష్టి దీని ప్రీరిలీజ్ ఈవెంట్ పైనే ఉంది. దీంతో ఈ ఈవెంట్పై రకరకాల వార్తలు పుట్టుకొచ్చాయి. ఈ కార్యక్రమం విజయవాడలో జరగనుందని ఎన్టీఆర్, హృతిక్ లు పాల్గొననున్నారంటూ జోరుగా ప్రచారం మొదలైంది. తాజాగా దీనిపై నిర్మాణసంస్థ స్పందించింది. కొన్ని రోజులుగా 'వార్ 2' ఈవెంట్ పై వస్తోన్న వార్తలు ఊహాగానాలు మాత్రమేనని స్పష్టం చేసింది. ఇప్పటివరకూ ఇంకా వేదికను ఖరారు చేయలేదని తెలిపింది. ఆ పనులు అన్నీ పూర్తయ్యాక అధికారికంగా తెలుపుతామని అప్పటివరకూ వేచి ఉండాలని సూచించింది. దీంతో ఈ వార్తలకు చెక్ పడినట్లైంది. ఎన్టీఆర్ గత చిత్రం 'దేవర' ప్రీరిలీజ్ ఈవెంట్లో చిన్న గందరగోళ పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో ఆ ఈవెంట్ను చివరి నిమిషంలో రద్దు చేశారు. అందుకే ఈసారి అన్ని జాగ్రత్తలు తీసుకొని వేడుకను ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్రాజ్ ఫిల్మ్స్ పై యూనివర్స్లో భాగంగా 'వార్ 2' రూపొందింది. కియార అద్వాణీ కథానాయిక. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్లో హీరోలిద్దరూ పోటాపోటీగా కనిపించారు. మిత్రులైనా సరే, ఆప్తులైనా సరే పట్టించుకోకుండా అడుగేసే ఓ సైనికుడిగా హృతిక్... మంచి-చెడు, తప్పు-ఒప్పు, పాపం పుణ్యం అనే విషయాల్ని పట్టించుకోకుండా పోరాటం చేసే మరో సైనికుడిగా ఎన్టీఆర్ కనిపించి ఆకట్టుకున్నారు.

# ఆమిర్ ఖాన్ ఇంటికి 25 మంది ఐపీఎస్ అధికారులు



బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఇంటికి 25 మంది ఐపీఎస్ అధికారులు రావడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పోలీసులు బస్సు, వ్యాన్లలో బాంద్రాలోని ఆమిర్ ఇంటికి వచ్చారు. ఇంతమంది నటుడి ఇంటిని ఆకస్మికంగా సందర్శించడం వెనక ఉన్న కారణం ఏంటని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై స్పష్టత కోసం ఓ ఆంగ్ల మీడియా ఆమిర్ టీమ్ సభ్యులను సంప్రదించగా దీనిపై వారికి కూడా కచ్చితమైన సమాచారం అందలేదని తెలిపారు. 'మేము కూడా ఇంకా ఆరా తీస్తున్నాం' అని సమాధానమిచ్చారు. నటుడిని కలవడం కోసమే వచ్చారని మరికొన్ని కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై స్పష్టత రావాల్సిఉంది. ఇక త్వరలో జరగనున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్బోర్న్కు ఆమిర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఆగస్టు 14 నుంచి 24 వరకూ ఈ వేడుక జరగనుంది. ఇందులో ఆయన నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'ను ప్రదర్శించనున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకొని మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

రిపబ్లిక్ సినిమా
CINEMA

# ఓటీటీలోకి సస్పెన్స్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!




సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'అరేబియా కడలి. సూర్యకుమార్ దర్శకత్వంలో ఇది రూపొందింది. స్టార్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దీనికి రైటర్గా పని చేయడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్గా కూడా వ్యవహరించారు. దీంతో ఈ సిరీస్పై ఆసక్తి నెలకొంది. తాజాగా దీని స్ట్రీమింగ్ వివరాలను అమెజాన్ పంచుకుంది. ఆగస్టు 8 నుంచి అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానున్నట్లు అమెజాన్ ప్రైమ్ తెలిపింది. 'కాలానికి అందరూ సమానమే. అందరూ ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సిందే' అంటూ పోస్టర్ను పంచుకుంది. రెండు గ్రామాలకు చెందిన కొందరు మత్స్యకారులు అనుకోకుండా బార్డర్ క్రాస్ చేస్తారు. దీంతో వాళ్లను విదేశీ జైల్లో బంధిస్తారు. అక్కడినుంచి వాళ్లు ఎలా బయటకు వచ్చారనే కథాంశంతో ఈ సిరీసు తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్గా ఇది రూపొందింది. 2024లోనే దీని చిత్రీకరణ ప్రారంభించారు. అయితే ఇటీవల ఇదే కథాంశంతో కొన్ని చిత్రాలు రూపొందినప్పటికీ ఈ కథ ఒరిజినల్ అని సంస్థ పేర్కొంది. ఇందులో సత్యదేవ్ సరసన ఆనంది నటించారు.


ప్రజా దినపత్రిక రిపబ్లిక్
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/161/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **2004:** ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం
- **1821:** పెరూ జాతీయ దినోత్సవం.
- **1909:** ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి, కాసు బ్రహ్మానందరెడ్డి జననం (మ.1994).
- **1914:** మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఆస్ట్రియాకు చెందిన ఆర్చ్‌డ్యూక్ ఫ్రాంజ్ ఫెర్డినాండ్ హత్య ఈ యుద్ధానికి నాంది పలికింది.
- **1956:** రంగస్థల నటుడిగా, అధ్యాపకుడిగా పేరుగాంచిన దీక్షిత్ మాస్టారు జననం (మ.2019)
- **1978:** న్యూజీలాండ్ క్రికెట్ క్రీడాకారుడు జాకబ్ ఓరమ్ జననం.
- **1979:** భారతదేశ 5వ ప్రధానమంత్రిగా చరణ్ సింగ్ ప్రమాణస్వీకారం. (చిత్రంలో)
- **2007:** ఇళ్ళ స్థలాల కోసం వామపక్షాలు చేసిన ఉద్యమంలో భాగంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంద్ లో ముదిగొండ వద్ద పోలీసు కాల్పులు జరిగి, ఏడుగురు మరణించారు.




కాలేయ వ్యాధి దినోత్సవం


పెరూ


కాసు బ్రహ్మానందరెడ్డి


మొదటి ప్రపంచ యుద్ధం


దీక్షిత్ మాస్టారు


జాకబ్ ఓరమ్


చరణ్ సింగ్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# చివరి టెస్టులో గెలవండి..

## దేశం కోసం సాధించండి:రిషబ్ పంత్ సందేశం



మాంచెస్టర్ వేదికగా జరిగిన టెస్టులో ఇంగ్లాండ్ తో జరిగిన మ్యాచ్ను భారత్ డ్రా చేసుకుంది. తొలి ఇన్నింగ్స్లో రిషబ్ పంత్ గాయంతోనే క్రీజ్లోకి వచ్చి హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో ఇన్నింగ్స్ లోనూ అవసరమైతే పంత్ బ్యాటింగ్కు వస్తాడని బీసీసీఐ ముందే చెప్పింది. కానీ, ఆ అవసరం రాకుండానే భారత బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. గాయం కారణంగా రిషబ్ పంత్ ఐదో టెస్టుకు దూరమైన క్రమంలో భారతజట్టుకు తన సందేశం ఇచ్చాడు. చివరి టెస్టులో గెలిచి దేశం కోసం అందిద్దామని పిలుపునిచ్చాడు. "నా జట్టుకు ఒకేఒక్క మెసేజ్ ఇస్తున్నా. గయ్స్ మనం గెలుద్దాం. దేశం కోసం చేద్దాం. వ్యక్తిగత లక్ష్యం గురించి ఆలోచించకుండా జట్టును గెలిపించేందుకు లేదా ముందుకు తీసుకెళ్లేందుకు ఏం చేయాలనేది వ్యక్తిగతంగా చేయాలనుకుంటా. సహచరులంతా ఇలాంటి సమయంలో అండగా నిలవడం బాగుంది. దేశం కోసం ఆడేటప్పుడు జట్టు ఒత్తిడిలో ఉన్నా సరే ప్రతిఒక్కరూ మద్దతు ఇస్తారు. అలాంటి భావోద్వేగాలను వివరించడం చాలా కష్టం. నా దేశం తరఫున ఆడడాన్ని ఎప్పుడూ గర్వంగానే భావిస్తుంటా" అని పంత్ వెల్లడించాడు.

### ఈ టెస్టుకు పంతే ఫౌండేషన్: గంభీర్

"నేనెప్పుడూ వ్యక్తిగత ప్రదర్శనల గురించి మాట్లాడను. నాకు అది ఇష్టం ఉండదు. కానీ, మాంచెస్టర్ టెస్టులో మాత్రం రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో చేసిన ఫౌండేషనే కీలకం. ఈసందర్భంగా పంత్కు అభినందనలు. కేవలం డ్రెస్సింగ్ రూమ్లోనే స్ఫూర్తి నింపలేదు. భావితరాలకూ ఇన్స్పిరేషన్. దేశం నీపట్ల ఎప్పుడూ గర్వంగానే ఉంటుంది" అని భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.

### సూపర్ కమ్ బ్యాక్: సచిన్

"ఓల్డ్ ట్రాఫోర్డ్ టెస్టు అత్యంత కీలకమని భారత్కు తెలుసు. ఒక దశలో వెనకబడినప్పటికీ పుంజుకున్న తీరు అద్భుతం. కంగ్రాట్స్ టీమ్ ఇండియా. కేఎల్ రాహుల్, శుభ్మన్ గిల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ఆడినవి సూపర్ ఇన్నింగ్స్లు. పోరాడేతత్వం ప్రదర్శించిన జట్టుకు అభినందనలు. చివరి టెస్టులోనూ విజయం సాధించాలని కోరుకుంటూ ఆలే బెస్ట్" అని సచిన్ పోస్టు చేశాడు.


## ఆరోగ్యం

# కిడ్నీ క్యాన్సర్ ఉంటే శరీరంలో కొన్ని లక్షణాలు

## కనిపిస్తాయి, అలసత్వం వహిస్తే మీకే నష్టం

ఈ రోజుల్లో కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం కూడా ఎక్కువై పోయింది. కిడ్నీ క్యాన్సర్‌ను వైద్య పరిభాషలో రీనల్ సెల్ కార్సినోమా అంటారు. ఈ వ్యాధి యొక్క అతిపెద్ద సవాలు ఏంటంటే, ప్రారంభ దశలో దీని లక్షణాలు చాలా తేలికగా ఉంటాయి లేదా అస్సలు కనిపించవు.

శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కిడ్నీలు శరీరంలో అనేక ముఖ్యమైన విధుల్ని నిర్వహిస్తాయి. రక్తాన్ని క్లీన్ చేయడం, శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్లు తొలగించడం, అదనపు ద్రవాల్ని ఫిల్టర్ చేయడం లాంటి పనుల్ని కిడ్నీలు నిర్వహిస్తాయి. అంతేకాకుండా మూత్రపిండాలు రక్తపోటును నియంత్రించడంలో, ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడంలో, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడంలో, ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సాయపడతాయి. ఎంతో కీలకమైన కిడ్నీలను జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. అయితే, వేగంగా మారుతున్న జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదముంది. మూత్రపిండాల సంబంధిత సమస్యల్ని గుర్తించే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇక, ఈ రోజుల్లో కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం కూడా ఎక్కువై పోయింది. కిడ్నీ క్యాన్సర్‌ను వైద్య పరిభాషలో రీనల్ సెల్ కార్సినోమా అంటారు. ఈ వ్యాధి యొక్క అతిపెద్ద సవాలు ఏంటంటే, ప్రారంభ దశలో దీని లక్షణాలు చాలా తేలికగా ఉంటాయి లేదా అస్సలు కనిపించవు. అందుకే దీనిని 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తారు. అందుకే కొన్ని సంకేతాల్ని గుర్తించడం చాలా ముఖ్యం. ఆ సంకేతాలు లేదా లక్షణాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.





### మూత్రంలో రక్తం (హెమటురియా)



మూత్ర విసర్జన సమయంలో మూత్రం గులాబీ లేదా లేత ఎరుపు రంగులో ఉంటే ఆ లక్షణం కిడ్నీ క్యాన్సర్‌కు మొదటి సంకేతం కవాచ్చు. అయితే, కొన్నిసార్లు ఇది ఇన్ఫెక్షన్ వంటి ఇతర కారణాల వల్ల కూడా రావచ్చు. అయితే, పదే పదే మూత్రం రంగు మారితే మాత్రం అలర్ట్ అవ్వాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదం జరుగుతుంది. అందుకే మూత్రంలో రక్తం కనిపిస్తే అలసత్వం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

### కడుపులో లేదా నడుము దగ్గర గడ్డలు




కడుపులో లేదా నడుము దగ్గర ఏదైనా భాగంలో గట్టిగా గడ్డల్లా ఉంటే ఆ లక్షణం కూడా కిడ్నీ క్యాన్సర్‌కు సంకేతం కావచ్చు. ఈ గడ్డలు కాలక్రమేణా పెరిగితే చాలా ప్రమాదం. అందుకే కడుపు లేదా నడుము దగ్గర ఏదైనా గట్టిగా గడ్డల్లా అనిపిస్తే మీరు నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహా తీసుకోండి. ఈ లక్షణాలు సాధారణంగా వ్యాధి ముదిరిన తర్వాత కనిపిస్తాయి.

### నడుము నొప్పి




కిడ్నీ క్యాన్సర్ ఉంటే గజ్జల్లో లేదా వీపు వైపున నిరంతర, అసాధారణ నొప్పి చాలా రోజుల పాటు కొనసాగుతుంది. ఇది సాధారణ నొప్పి కంటే చాలా భిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఈ నొప్పిని తట్టుకోలేరు. ఈ లక్షణం కిడ్నీ క్యాన్సర్‌కి సంకేతం కావచ్చు. ముఖ్యంగా నొప్పి గుచ్చుతున్నట్లుగా తీవ్రంగా ఉంటే జాగ్రత్త. ఒక్కోసారి విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా ఈ నొప్పి తగ్గకపోవచ్చు. పదే పదే ఈ లక్షణం కనపడితే వెంటనే అలర్ట్ అవ్వండి. వైద్యుణ్ని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోండి.

### బరువు తగ్గడం, ఆకలిగా అనిపించకపోవడం



ఎటువంటి కారణం లేకుండా ఆకస్మాత్తుగా బరువు తగ్గితే అలర్ట్ అవ్వండి. అంతేకాకుండా ఏదైనా తినాలనిపించకపోవడం, ఆకలి లేకపోవడం కూడా మంచి లక్షణాలు కావు. ఈ సంకేతాలు శరీరంలో ఏదైనా తీవ్రమైన వ్యాధికి సంకేతం కావచ్చు. మూత్రపిండాల క్యాన్సర్ సమయంలో కూడా ఈ లక్షణాలు కనిపిస్తాయి. అందుకే వీటిని నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### విపరీతమైన అలసట, రక్తహీనత



మూత్రపిండాలు రక్తాన్ని ఫిల్టర్ చేయడంతో పాటు శరీరంలో ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి చేయడంలో సాయపడతాయి. అయితే, కిడ్నీ క్యాన్సర్ ఉంటే ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. దీని వల్ల రక్తహీనత, తీవ్రమైన అలసట సంభవించవచ్చు. ఈ అలసట సాధారణం కన్నా భిన్నంగా ఉంటుంది. మీరు ఏ పని లేదా శారీరక శ్రమ చేయకపోయినా అలసట, బలహీనత అనిపిస్తే అలర్ట్ అవ్వండి. నిద్ర పోయిన తర్వాత కూడా అలసట అనిపిస్తుంది. ఈ లక్షణాలు పదే పదే కనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వండి.

### తరచుగా జ్వరం



మీకు పదే పదే జ్వరం రావడం, వచ్చిన జ్వరం ఎక్కువ కాలం ఉండటం, జ్వరంతో పాటు ఫ్లూ లాంటి లక్షణాలు ఉంటే అది కిడ్నీ క్యాన్సర్‌కు సంకేతం కావచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు. పూర్తి పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ఈ లక్షణాలన్నీ ప్రారంభ దశలో కనిపిస్తాయి. మూత్రపిండాల క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తే.. రోగికి రక్తంతో కూడిన దగ్గు, నిరంతర ఎముకల నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిస్తాయి.

### గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.